


## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్ధ నిశీథిలో
ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాధుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

--- శ్రీ బాబూజీ

## అనుభవాలు - అమరికలు


| | | | |
|---|---|---|---|
| 1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి! | శ్రీ బాబూజీ | ............... | 2 |
| 2. ఉన్నమాట - అనుకున్న మాట | గురుబంధువులు | ............... | 3 |
| 3. స్వీకరించడమే అనుగ్రహం | రాజశేఖర్ | ............... | 8 |
| 4. సందేహమూ ఉంది - సంజీవిని చెంతనుంది | అరుణకృష్ణ | ............... | 9 |
| 5. అంతటా నిండిన అభయ ప్రదాత | ఝాన్సీకుమారి | ............... | 11 |
| 6. గురుబంధువులే గురుతులుగా ... అనుభూతులే ముద్రలుగా... | ఉమ, శ్రీ | ............... | 14 |
| 7. ఎందరు భక్తులో అన్ని రూపాలు | వీరాస్వామి | ............... | 18 |
| 8. రసస్పందన | గురుకృప | ............... | 20 |


గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి
leelas@guruji.org కి mail చేయగలరు.
ఇంటర్‌నెట్‌లో "గురుకృప" - Visit : www.guruji.org





సంపుటి : 9
సంచిక : 4
త్రైమాసిక పత్రిక
అక్టోబరు 2006

**నిర్వహణ**
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
2-1-6
గాంధీచౌక్
తెనాలి - 01

☎
08644
227194 (O)

**ముద్రణ**
రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం
ఫోన్స్ : 2798072,
2740222

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై !**
**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై !**

# గురుకృప

### ఉన్నమాట - అనుకున్నమాట

## సద్గురు కథామృతం తప్త జీవనమ్

సద్గురు కథామృతమే (స)జీవనానికి బాటయై ఉన్నది. సద్గురు చరితమే జీవితానికి తృప్తి నొసగు సాధనమని, సద్గురు నామమే ముక్తి పథమునకు మార్గమని, సద్గురు చరణమే సకల శుభ సాధకమని వేనోళ్ళ కీర్తించి భక్తి పథమునకు బాటలు వేసింది భారత ఆధ్యాత్మిక సంస్కృతి. సద్గురు కథామృతాన్ని తనివితీరా గ్రోలు జీవితమే (స)జీవము. సద్గురు అనుగ్రహామృతాన్ని పంచుకొను జీవితములు ధన్యము. ఇతరములను గ్రహించడాన్ని త్యజించి, '**అనుగ్రహించడమే**' తమ కార్యంగా స్వీకరించిన సద్గురునాథుని చరితం ఒక కమనీయ కావ్యం. సద్గురు చరితమనే పవిత్రగంగలో మునకలేయటానికి '**గురుకృపే**' ఆలవాలం, సందేహమే లేదు.

సద్గురు భక్తునికి సద్గురు సన్నిధి వినా మరేదీ ఆనందధామం కాలేదు. సద్గురు దర్శనం తనువంతా పులకరింతను, సద్గురు రూపం మనసంతా ప్రశాంతతను, సద్గురు నామము అభయాన్ని, సద్గురు భాషణం ధైర్యాన్ని, వారి స్పర్శ కొండంత బలాన్ని, చివరకు వారి ఊహ కూడా అంతులేని ఆనందాన్ని ఇస్తుందనేది శాస్త్రవాక్యమైతే - అందుకు నిరూపణ సద్గురు దేవులు శ్రీ బాబూజీ. వారితో గురుబంధువులందరికీ ఉన్న బంధాన్ని సరళమైన భాషలో మనకు పంచుతున్నారు.







అది మే22, 2006, ఆదివారం ఈ సంవత్సరంలో అది ఒక అపురూప దినం. ఎప్పటికీ గుర్తుండేలా ఉంది ఆ రోజు. 4నెలల 18 రోజుల (అంటే 138 రోజులు) తర్వాత గురువుగారి దర్శనం లభించడం. గురువుగారిని ఆఖరుగా దర్శించింది జనవరి 4వతేది. ఆ తరువాత రోజు నుంచి ఆయన దర్శన భాగ్యం మళ్ళీ ఎప్పుడెప్పుడు లభిస్తుంది, ఆయన పాదాలకు మ్రొక్కే అదృష్టం ఎప్పుడు దొరుకుతుంది, ఆయన ప్రేమమయమయిన చూపు మన మీద ఎప్పుడు ప్రసరిస్తుందా అని ప్రతి గురుబంధువు ఆయనను ప్రార్థించని క్షణం ఉండదేమో! చివరిసారి జనవరిలో ఆయనకు వీడ్కోలు పలుకుతూ చేసుకున్న దర్శనం తరువాత మళ్ళీ పునఃదర్శనం శిరిడీలోనే చేసుకోబోతున్నామన్న తలపు మాకందరికీ ఒక కొత్త ఉత్తేజాన్నిచ్చింది. శిరిడీలో అప్పుడున్న గురుబంధువులందరిలో ఆనందం, ఆశ్చర్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. అందరం గురుచరణ్ దగ్గర వేయికళ్ళతో ఆయన రాకకై ఎదురు చూస్తూ నిలుచున్నాం. సాయంత్రం గం॥6:10ని॥లు దూరంగా గురువుగారు విచ్చేస్తున్న కారు కనబడగానే అందరూ అంతకాలం వేచి చూస్తున్న క్షణం రానే వచ్చిందని సంబర పడిపోయారు. అందరూ ఏక కంఠంతో శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై, సద్గురు శ్రీసాయినాథుని శరత్ బాబూజీకీ జై అని పలికి, గురువుగారికి అతి ప్రీతికరమైన బాబా నామాన్ని హృదయపూర్వకంగా భజించసాగారు. గురువుగారు కారు దిగగానే అందరమూ ఒకరి తర్వాత ఒకరం గురుదేవుల పాదపద్మాలకు నమస్కరించుకున్నాము. అక్కడ ఏ తోపులాటలు లేకుండా, ఎటువంటి హడావుడి లేకుండా అందరూ ఆ ప్రసన్నవదనుని ప్రశాంతంగా తిలకించారు. తదుపరి ఆయన అందరిపై తమ అనురాగాన్ని వర్షిస్తూ నెమ్మదిగా నడిచి, గురుచరణ్ గుమ్మం వద్ద నిలబడి, అందరినీ ప్రేమతో వీక్షించగా ఆ చూపులు ప్రతి ఒక్కరినీ పేరు పేరున పలకరించినట్లనిపించాయి. అలా అందరినీ సంతృప్తి పరచి మెల్లగా మెట్లెక్కి తమ నివాసంలోకి వెళ్లారు. అక్కడున్న ప్రతి గురుబంధువు ఈ ఒక్క దర్శనం చాలు, ఇంక మనకేది  అవసరం లేదు అని ఆనందంలో ఓలలాడారు.

గురువుగారు శిరిడీ వచ్చారని తెలియగానే గురుబంధువులందరూ హుటాహుటిన శిరిడీ చేరుకోసాగారు. ఎవ్వరికీ దూరం, డబ్బు, రైలు రిజర్వేషన్లు ఏవీ అడ్డనిపించలేదు. వెంటనే శిరిడీకి చేరుకోవాలి, ఆయన దర్శనం చేసుకోవాలని ఒక్కటే వారి ఆలోచన. మే23,24 తారీఖుల్లో గురువుగారి దర్శనం లభించలేదు. ఒక పక్క దర్శనం లేదని గురుబంధువులందరూ ఎంతో నిరుత్సాహపడినా, మరొక పక్క ఆ సద్గురు మూర్తి సన్నిధిలో వున్నాము అంతకంటే ఇంకేం కావాలనే ఉత్సాహంతో ఉన్నారు. 25వ తేదీన గురువుగారు సాయిపథం సత్సంగ హాలులో సాయిబాబా నామసంకీర్తనలో పాల్గొన్నారు. ఆ ప్రాంగణం మొత్తం బాబా నామంతో హోరెత్తింది. ప్రతి ఒక్కరూ కన్నార్పకుండా ఆయనకేసి తదేకంగా చూస్తున్నారు. ఆయన









ప్రేమపూరితమైన చూపు అందరి మీదా ప్రసరింపచేసి, ధ్యానంలో నిమగ్నమయినారు. ధ్యానానంతరం బాబాకు నమస్కరించి, గురుచరణ్ వైపుకు వస్తుంటే భక్తులంతా దారి పొడుగునా బారులు తీరారు. వారంతా ఒకే క్రమంలో నిలబడి, ఆయన తమ చెంతకు ఎప్పుడు వస్తారా ఎప్పుడు వారితో తమ బాధలను నివేదించుకుందామా, ఎప్పుడు ఆయనకు పాదాభివందనం చేద్దామా అని ఎనలేని ఉత్సాహంతో, ఉత్కంఠతతో వేచి చూస్తున్నారు. చిన్న,పెద్ద, ఆడ,మగ,వృద్ధులు, ఇలా అందరూ వయోబేధం లేకుండా, గురువుగారు సత్సంగ హాలునుండి బయటకు వచ్చేలోపు, పరుగెత్తుకుంటూ వచ్చి దారిలో నిలబడే దృశ్యాన్ని చూస్తుంటే ఎంతో ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంటుంది. అంత వయోవృద్ధులకు కూడా అలా పరుగెత్తే శక్తి ఎక్కడ నుండి వస్తుంది? అంత మంది జనం అలా పరిగెత్తినా గురువుగారు వచ్చే సమయానికి క్షణాల్లో అంతా ప్రశాంతంగా ఎలా ఉంటుంది అని తరువాత ఆలోచిస్తే ఎంతో ఆశ్చర్యం కలుగజేస్తుంది.

గురువుగారు కూడా వారిలో ఉండే ఆర్తిని చూసి కాబోలు చాలా నెమ్మదిగా, అడుగులో అడుగులేస్తూ, ప్రతి ఒక్కరిని పలకరిస్తూ, వారు చెప్పినదంతా వింటూ, వారు తనివి తీరేట్లుగా ఆశీర్వదిస్తూ ప్రసన్నవదనులై నడుస్తున్నారు. తెల్లని దుస్తుల్లో ధగధగ మెరిసిపోయే ఆ మహామూర్తి, బాబా నామం ఎలుగెత్తి భజిస్తూ ఆయన వెన్నంటి వచ్చే భక్తబృందం, ఇక బారులు తీరి ఒకరి తరువాత ఒకరు పాదాభివందనం చేస్తున్న భక్త జనం – చూడడానికి ఆ దృశ్యం ఎంతో మనోహరంగా ఉంటుంది. కొందరు తమ ప్రక్కనున్న ప్రపంచాన్ని మరచిపోయి ఆయనను చూస్తున్నారు, కొందరు ఆయనకు తమ బాధల్ని విన్నవించు కుంటున్నారు, కొందరు ఆయన స్పర్శతో పునీతం చేసినదేదైనా తమ చెంత ఉండాలని బాబా ఫోటో, బాబా విగ్రహం, పెన్ను, పుస్తకం. ఇలా వారి మనసుకు తోచినది వారు తమ చేతులలో పట్టుకొని ఆ కరుణామూర్తి కరస్పర్శకై ఎదురుచూస్తున్నారు. ఆ మహానుభావుడు అందరినీ ఉత్సాహపరుస్తూ వారి వారి మనోభీష్టాలను నెరవేరుస్తున్నారు. అలా ఆ కరుణాసాగరుడు, గురుచరణ్ గుమ్మం వద్దకు రాగానే శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై, సద్గురు శ్రీసాయినాథుని శరత్ బాబూజీకీ జై అన్న జయ ధ్వానాలు నింగినంటేలా మారుమ్రోగాయి. గురువుగారు అక్కడ ఒక నిమిషంపాటు నిలబడి అందరిని ఆత్మీయంగా పరికించి, నెమ్మదిగా మెట్లెక్కి తమ నివాసంలోకి వెళ్ళిపోయే దృశ్యం ఇప్పటికీ కళ్ళ ముందు ఇంకా మెదులుతూనే ఉంది. రోజురోజుకీ భక్తుల సంఖ్య పెరిగిపోతోంది. రెండురోజులు (మే25,26) రాత్రి 8 గం।। – 9గం।। మధ్య అందరూ గురువుగారిని సందర్శించుకున్నారు.

ఇక మే27 గురువుగారి వివాహ వార్షికోత్సవం. ఆ రోజున భక్తుల సంఖ్య పెరిగిపోయింది. సాయిపథం సత్సంగ మందిరం మొత్తం పూలతో అందంగా అలంకరించారు. వేదికపైన పూల అలంకరణ చూడడానికి









చాలా సామాన్యంగా ఉన్నా, ఎంతో అద్భుతంగా, ఆకర్షణీయంగా ఉంది. ఆ రోజు ఆ మహాత్ముడిని ప్రసన్నం చేసుకోవటానికి బాబా నామం తప్ప మరే సాధన లేదన్న విషయం భక్తులందరికీ విదితమే. అందుకే ఉదయం 6గంటలు నుండే అఖండ సాయినామసంకీర్తన మొదలయింది. దినమంతా సాయిపథం సత్సంగ హాలు సాయిబాబా నామంతో హోరెత్తింది. అలా దినమంతా సాగిన సాయినామ సంకీర్తన రాత్రి 7గం॥ నుండి తారాస్థాయికి చేరుకుంది. 8గంటలకు గురువుగారు తమ నివాసం నుండి నడుచుకుంటూ వచ్చి, సత్సంగ మందిరంలో అందరితో కలిసి సాయినామ సంకీర్తనలో పాల్గొన్నారు. అందరినీ ప్రేమ పూర్వకంగా తిలకించి, ధ్యాన నిమగ్నులయ్యారు. ధ్యానానంతరం 27 మంది తల్లిదండ్రులు తమ బిడ్డలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించుకొనే భాగ్యం కలిగింది. ఆ దృశ్యాన్ని తిలకిస్తున్న సాయి భక్తులందరికీ మళ్ళీ పసిపిల్లలమైతే బాగుండు అని అనిపించక మానదు. అలా వారందరిని సంతృప్తి పరచి, ఎప్పటిలాగే బాబాకు ప్రణమిల్లి తమ నివాసానికి బయలుదేరారు.

గురుదేవులు సాయిపథం ప్రాంగణం బయటకు వచ్చేలోపే భక్తులందరూ ఒక క్రమంలో దారి పొడుగునా పరుగుపరుగున వచ్చి నిలబడిపోయారు. ఆయన ఎంతో శాంతంగా, చిద్విలాసంగా ప్రతి ఒక్కరిని అలరించారు. వరుస ముందు ఒక చోట దర్శనం చేసుకుని తమ బాధను నివేదించుకున్నా, మళ్ళీ ముందుకు పరుగెత్తి మళ్ళీ ఆయనను చూడాలని, ఆయనతో మాట్లాడాలని భక్తులు పరుగులిడడం చూస్తుంటే అది వారికి గురువుగారిపై గల భక్తి, ప్రేమలకు తార్కాణమనిపించింది.

ఇక్కడ ఇంకో విశిష్టకరమైన సంఘటన చోటుచేసుకుంది. కొంతమంది మానసిక, శారీరక వికలాంగులు మరియు హైదరాబాద్ నుండి గురుబంధువులతో వచ్చిన 8మంది అంధులు గురువుగారి దర్శనభాగ్యం కొరకు వరుసలో కూర్చొని ఉన్నారు. గురువుగారు వారికోసమే వచ్చినట్లుగా వారి దగ్గర ఎక్కువ సమయం గడిపారు. ప్రతీ ఒక్కరిని పలకరించారు. వారు చెప్పినదంతా విన్నారు. ఆ మహాత్ముడి స్పర్శతో వాళ్ళు అమితానందాన్ని అనుభవించారు. అలా ఆయన తమ అనుగ్రహ వర్షం అందరి మీదా సమంగా కురిపించి సంతుష్టిపరచి వెళ్లారు.

మరుసటి రోజు, అంటే 28వ తేదీ కూడా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. రాత్రి 8గం॥లు కావస్తుంది. సాయిపథం సత్సంగ హాలు భక్తులతో నిండిపోయింది. అందరూ ఆర్తితో బాబా నామాన్ని భజిస్తున్నారు. ఇంతలో వాతావరణం చల్లగా మారిపోయింది. హోరుగా గాలి, జోరుగా వర్షం మొదలయింది. ఎంతగాలి అంటే పెద్ద చెట్టుకొమ్మ విరిగి వచ్చి సత్సంగహాలు ప్రక్కన పడింది. సత్సంగ హాలు లోపలికి కూడా వర్షపు జల్లులు పడసాగాయి. భక్తులు మాత్రం ఏమాత్రం కదలక నామంలో మునిగిపోయారు. ఆ నామంలో









తడిసి ముద్దయిన వారిని, ఈ వర్షపు చినుకులు ఏం చేయగలవు? ప్రకృతి కూడా ఆ నామానికి ఆడి,పాడుతున్నట్లుంది. అంత పెద్ద వర్షం అలా దాదాపు అరగంటపైనే పడింది. సాయిపథం సత్సంగ హాలు దాదాపు సగభాగంపైనే తడిసిపోయింది. అయినా గురుబంధువులెవరు అక్కడనుండి కదలట్లేదు. మేము కొంత మంది ఇక ఈ రోజు గురువుగారు రారు, ఆయన దర్శన భాగ్యం ఉండదనే అనుకున్నాము. కాని, ఆయన చర్యలు ఎప్పుడూ మన ఊహకందనివిగా, ఊహించని విధంగా ఉంటాయి. అక్కడ గురుబంధువులలో వుండే ఆర్తికి మెచ్చి కాబోలు గురువుగారు సాయిపథం సత్సంగ హాలు వేదికపైకి వచ్చి సాయినామ సంకీర్తనలో పాల్గొన్నారు. అప్పుడున్న ప్రకృతి అందాన్ని మాటల్లో వర్ణించలేము. అలాంటి సమయంలో ఆ మహాత్ముని దర్శనం నిజంగా అపూర్వం, అమోఘం. రోజులాగానే ఆయన తిరిగి వెళ్ళే సమయంలో అందరూ ఒక క్రమంలో నిలబడ్డారు. ఎవ్వరూ నీళ్ళను, బురదను లెక్కచేయలేదు. ముందు వరుసలో ఉండే వాళ్ళందరూ వారి మోకాళ్లపై కూర్చుని ఆయనకు పాదనమస్కారం చేసుకుంటున్నారు. ఆయన కూడా రోజూ మాదిరిగానే అందరినీ సంతృప్తి పరిచారు. చూడటానికి రోజూ దర్శనం ఒకే లాగా జరిగినా, ఏ రోజుకారోజు ఒక కొత్తదనం, మళ్ళీ కొత్తగా ఆయనను చూస్తున్నట్లే ఉండేది.

మరురోజు మే29 ఉదయాన్నే గురువుగారు శిరిడీ నుండి బయలుదేరుతున్నారని తెలిసి అందరూ గురుచరణ్ దగ్గరకు చేరుకున్నారు. ఆయన పయనం ఎంతో బాధ కలిగిస్తున్నా, ఆ మహాత్ముడికి వీడ్కోలు చెప్పాలని మళ్ళీ ఆయన చూపు తమ మీద పడాలని అందరూ 2,3గంటల ముందు నుంచే అక్కడకు చేరుకోసాగారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా అందరూ ఆ మహాత్ముని దర్శించుకునే విధంగా ఒక క్రమంలో నిలబడ్డారు. అలా గురుచరణ్ నుండి సాయిపథం వీధి చివర వరకు భక్తులందరూ బారుగా నిలబడ్డారు. గురువుగారు దాదాపు 9గంటల సమయంలో తమ నివాసం నుండి బయటకు వచ్చి అందరినీ ప్రేమతో పరికించి, కారులో ఆసీనులైనారు. కారు అతి మెల్లగా మామూలుగా నడుస్తున్నంత వేగంతో వెళ్ళడంతో గురువుగారు ప్రతి ఒక్కరిని వీక్షించారు. అంత మంది వున్నా అందులో ఆయన చూపు పడలేదన్న వారు ఒక్కరు కూడా లేరు. గురువుగారు నన్ను చూసి నవ్వారు, గురువుగారు నన్ను ఆశీర్వదించారు, గురువుగారు నన్ను చూసి తల ఊపారు, గురువుగారు మమ్మల్ని పలకరించారు ఇలా ఎవరికి వారు తమ అనుభవాన్ని చెప్తుంటే హృదయం పులకరిస్తుంది.

గురువుగారు శిరిడీలో వున్న ఏడురోజులు ఏడు క్షణాలుగా గడిచిపోయాయి. ఇలా ఆయన దర్శన భాగ్యం మళ్ళీ మళ్ళీ కలగాలని హృదయపూర్వకంగా ఆయన పాదపద్మాలకు నమస్కరిస్తూ.... **–గురుబంధువులు**







# స్వీకరించడమే అనుగ్రహం

సద్గురు మధుర ప్రసాదం ఈ జీవితం. మనలను చేయిపట్టి నడిపించి 'తాను' పూర్ణునిగా మనలను మలచడమే సద్గురు అవతార కార్యం. ఈ దుస్తరకార్యాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న దైవం శ్రీబాబూజీ. అందుకే అంటారు శ్రీ బాబూజీ "జీవితం తానంతటదే సంపూర్ణత్వం పొందేందుకు నిరంతరం ప్రయత్నిస్తుంది. సంపూర్ణత్వం పట్ల మనకున్న ప్రణాళికతో ఆపేందుకు ప్రయత్నించవద్దు" అని. ఈ పరిపూర్ణతను సాధించడానికే వారు ప్రసాదించారు ఎన్నో ఉపకరణాలు – నియమపాలనం, బాబాను గొంతెత్తి పిలవడం, చరిత్రను అధ్యయనం చేయడం......ఇత్యాదులు (గురుదేవుల సత్సంగభాషణం). ఈ ఉపకరణాలు మనలను మరింతగా వారి చెంతకు చేర్చాలి, అంతేకానీ వివేకంతో కూడుకోని ఒక వింత చర్యగా మారరాదు. అనుభవాల మాటున ఉన్న అసలు తత్త్వాన్ని గ్రహించే ప్రయత్నం చేద్దాం. **– గురుకృప**

నాపేరు రాజశేఖర్, మాది కర్నూలు. నాకు గురుదేవులు మిషగా అందించిన ఒక చిన్న బోధను మీతో పంచుకుంటాను. 2006 మార్చి నెలలో నేను శిరిడీకి వచ్చాను. నాకు పెళ్ళి అయిన తర్వాత అదే మొదటిసారి శిరిడీకి రావడం. ఒక రోజు నారాయణరావు అంకుల్ వాళ్ళింటికి వెళ్లాము. గురువుగారి గురించి చెబుతున్న సందర్భంలో – "చిన్నదైనా, పెద్దదైనా ఏ పనైనా చేసేటపుడు, ఎక్కడికైనా వెళ్ళేటపుడు గురువుగారికి చెప్పివెళ్ళడం నియమంగా అలవాటు చేసుకో! మంచిది" అని అంకుల్ చెప్పారు. సరే! కర్నూలు వచ్చాక నారా అంకుల్ చెప్పిన నియమం ప్రారంభించాను. ఇది ఇలా ఉండగా నేను కొన్ని రోజుల క్రితం కొన్న బైక్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం రోడ్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసుకు వెళ్ళాలి. గురుదేవులకు నేను చేయాల్సిన పనిని చెప్పుకుని వెళ్ళాను. నాకు ట్రాన్స్‌పోర్టు ఆఫీసులో ఒక వ్యక్తి పరిచయం ఉంది, వారు మంచి హోదాలో ఉన్నారని నా ఆలోచన. సరే! నాకు ఆఫీసు వాళ్ళు చెప్పిన విధంగా అవసరం ఉన్న అన్ని పేపర్లు తీసుకువెళ్ళాను. అంతా అయ్యాక రెసిడెన్స్ ప్రూఫ్ లేదు, కాబట్టి పని అవ్వదన్నారు. నాకు సరిగా వివరాలు తెలపని వ్యక్తి పైన ఉన్న కోపాన్ని ఇంట్లో వారిపై చిరాకు రూపంలో ప్రదర్శించి, క్లినిక్‌కు ఎవరో పేషంట్ వచ్చారని తెలిసి బయల్దేరాను. వెళ్ళేదారిలో నా ఆలోచన – "నేను గురువు గారికి చెప్పుకునే కదా బయలుదేరాను, నారా అంకుల్ అలా చేస్తే మంచిదన్నారు. ఎందుకు ఇలా జరిగింది" అని అనుకుంటూ క్లినిక్ చేరేసరికి నాకోసం జిల్లా ట్రాన్స్‌పోర్టు కమీషనర్ వేచి ఉన్నారు. ఆయనతో ఇప్పుడు మీ ఆఫీసుకే వెళ్ళి వస్తున్నాను, రెసిడెన్స్ ప్రూఫ్ తీసుకుపోని కారణంగా పని అవ్వక







తిరిగివచ్చాను" అని చెప్పాను. ఒక్క సంతకం పెట్టండి సార్! మిగతా విషయాలు నేను చూసుకుంటాను అని ఆయన అన్నారు. బైక్ అక్కడికి తీసుకురావాలి కదా అంటే ఈ జిల్లాకు నేనే అధికారిని, నేను బైక్ ఇక్కడే చూసాను కదా అన్నారు. బండి నెంబరు సెలక్షన్ కావాలంటే కొంతమొత్తం కట్టాలంటే, నాకు వద్దని చెప్పాను, ఆయనే మంచి నంబరు కూడా సెలక్ట్ చేసి నేను ఉన్న చోటకే పేపర్లు పంపారు. నారా అంకుల్ చెప్పిన ఆ నియమాన్ని ఆ రోజు నుంచి నిత్యకృత్యంగా మార్చుకున్నాను. **–రాజశేఖర్, కర్నూలు**

## సందేహమూ ఉంది - సంజీవని చెంతనుంది

గురుబంధువుల్లారా! మదరాసు భజన సమాజం లీల మరపులోనికి వెళ్ళలేదు కదా! బాబా చెంత అందే ద్రవ్యం కోసం భజన చేసే భర్త, భక్తితో భజన చేసిన భార్య, తన ఇష్టదైవమైన రాముని దర్శనం చేసుకొని పులకిస్తే సంకోచించాడు భర్త. స్వప్నంలో గాంచిన ఇబ్బందులను తొలగించమని వేడుకున్న అతనిని బాబా అడుగుతారు "ఈ నమస్కారములకు ఇంతకు ముందరి నమస్కారములకేమైన భేదము ఉన్నదా"? అని! 'ముందటి నమస్కారములు మీ వద్ద పైకము తీసుకొనుటకై చేసితిని. ఈ నమస్కారము మిమ్ము దేవునిగా భావించి చేసినది' అని అంటాడు మదరాసి. ఇపుడు ప్రాంతం మారింది, పేర్లు మారాయి – గురుదేవులకు తాను ఇంతకు మునుపు చేసిన ప్రణతులకు, ఇప్పటి వినతులకు అట్లాంటి భేదమే ఉందంటున్నారు– తెనాలి గురుబంధువు. గురుదేవుల సర్వ సమర్థత మీద విశ్వాసం కుదరని తాను, తానున్న పరిస్థితుల్లో మందులకోసమై వెదికింది – నీవున్నది సంజీవని చెంతన అని తెలియచేసారు గురుదేవులు. ఈ ద్వారకామాయి – తన ఒడిన చేరిన బిడ్డలను వారి ఆపదల నుండి, చింతనల నుండి సంరక్షిస్తుంది. ఇక అనుభవం లోనికి... **– గురుకృప**

నా పేరు అరుణకృష్ణ, మాది తెనాలి, నేను 1994 నుండి సత్సంగానికి వెళుతున్నాను. ప్రతిగురుపౌర్ణమికి, దసరాకి తప్పని సరిగా అమ్మని తీసుకుని శిరిడీ వెళతాను. నాకు సాయిబాబా అంటే అమితమైన భక్తి, నమ్మకం. ఎవరైనా, ఏదైనా అంటే నా బాబా ఉన్నారు నాకేంటి అంటాను. గురువుగారిని గురించి నేను అసలు ఆలోచించేదాన్ని కాదు. అందరూ నమస్కారం చేస్తుంటే, నేను కూడా నమస్కరించే దాన్ని. బాబూజీ ప్రత్యక్షంగా కన్పించే దైవమనీ, కదలాడే సాయి అని తెలుసుకోని, అజ్ఞానంతో మూసుకు పోయిన నా కనులు తెరచే క్షణం రానే వచ్చింది.





అమ్మతో కలిసి గురుపూర్ణిమకి శిరిడీ వెళ్ళాను. అమ్మకి బి.పి., షుగర్, హార్ట్ఎటాక్, కిడ్నీప్రాబ్లమ్ అన్నీ ఉన్నాయి. ఒక గంట మందు వేసుకోకపోతే బ్రతకలేదు. అలాంటి పరిస్థితి. ఇంటి దగ్గరబయలు దేరే ముందు రెండు రోజులకు మందులు విడిగా పర్స్‌లో పెట్టుకుని, మిగిలినవి బ్యాగ్‌లో పెట్టాలనుకున్నాము. నేను సర్దానని అమ్మ, తను సర్దిందని నేను అనుకుని మందులు బ్యాగ్‌లో పెట్టడం మర్చిపోయాము. మరురోజు శిరిడీలో దిగిన తర్వాత మందుల కోసం చూస్తే లేవు. మా ప్రక్కన కేసర్ షోరూం ప్రసాద్‌గారు ఉంటే, వారికి ఈ మందులు చూపాము. అవి జనరల్ మందులు. శిరిడీలో ఎన్ని షాపులు వెతికినా అమ్మ వాడేవి దొరకలేదు. వెంటనే తిరిగి వచ్చేద్దాము అనుకున్నాము. మనసంతా అలజడి అమ్మ ఏమవుతుందో అని భయం. ఆ రోజు రాత్రి గురువుగారు దర్శనమిచ్చారు.

గురుదేవా! నీవు నిజంగా దైవస్వరూపానివైతే, నీవున్నది నిజమైతే ప్రస్తుతం ఏ ఇబ్బంది లేకుండా అమ్మని కాపాడండి అని వేడుకున్నాను. అమ్మ ఊదీ నోట్లో వేసుకుంటూ నుదుటిన పెట్టుకున్నది. నరేంద్రగారికి అమ్మ పరిస్థితిని గురువుగారికి తెలియపరచమని చెప్పాము. అనుకోకుండా అమ్మకి చాలా హుషారు వచ్చింది. నాకు బాగానే ఉంది మూడు రోజులు ఉండే వెళదాము అని అన్నది. నాకు మాత్రం గురువుగారు కాపాడతారా? లేదా? అని సందేహం.

4వరోజు మేము బయలుదేరాము. గురువుగారి పాదాలకు నమస్కరించుకునే అవకాశం కలిగింది. ఊదీఇచ్చారు. నాచేతిలో ఊదీపెడుతూ నా వైపు చూశారు. ఆ చూపు అక్కడ బాబా కూర్చుని నన్ను చూస్తున్నట్లు అన్పించింది. నాకు వెన్నులో నుండి జలదరింపు వచ్చింది. కళ్ళవెంట కారే నీరు కూడా తుడుచుకోవటం మర్చిపోయి గురూజీని చూస్తూ నమస్కారం చేసుకున్నాను. ఇంతకు ముందు చేసిన నమస్కారములకి, ఇప్పటి నమస్కారములకి తేడా ఉంది. మద్రాసు భజన సమాజం యజమాని చేసిన నమస్కారంలాగున్నది. బాబా చరిత్రలోని సంఘటనలు మరలా పునరావృతం అవుతున్నాయి అన్పిస్తుంది. కుండపోత వర్షంలో మేము తిరుగు ప్రయాణం అయినాము. దారిలో కొంతమంది వ్యానులు ఆగిపోయి ఇబ్బంది పడటం చూశాము. మేము మాత్రం క్షేమంగానే నాగర్‌సోల్, అక్కడి నుండి సికింద్రాబాద్ చేరాము. సికింద్రాబాద్ వచ్చాక లైట్‌గా అమ్మకి జ్వరం వచ్చింది. మందులు కొని వేసాను. అప్పుడు నాకు అన్పించింది ఇవ్వటానికి గురువుగారు సిద్ధంగా ఉన్నా, అడగటం నాకు చేతకాలేదేమో అని, "ప్రస్తుతం అమ్మని కాపాడండి" అన్నాను కానీ, "పూర్తిగా ఆ రుగ్మతలను తొలగించమని అడుగలేదే" అన్పించింది.



తర్వాత తిరువణ్ణామలైలో బాబూజీ దర్శనం చేసుకున్నాను. గురువుగారి దర్శనం చేసుకోవటం లేటయితే మనసంతా ఏదో బెంగగా అన్పిస్తుంది. నాకు సత్సంగం అంటే చాలా ఇష్టం. ప్రతి రోజూ క్రమం తప్పకుండా సత్సంగానికి వెళతాను. సత్సంగానికి వెళ్లేలాగా, అక్కడ సేవ చేసుకునేలాగా అనుగ్రహించమని అడిగాను గురువుగారిని– అలాగే అనుగ్రహించారు నన్ను. ఇలా నేను ఏది అనుకుంటే అది నెరవేరేలా చేసి, నా వెన్నంటి ఉండి, నన్ను కాపాడే నా గురుదేవుని గురించి ఈ జీవితమంతా వ్రాసినా తక్కువే అన్పిస్తుంది.

**– అరుణకృష్ణ, తెనాలి**

# అంతటా నిండిన అభయ ప్రదాత

**అంతటా నిండిన అభయ ప్రదాత** అయిన **శ్రీ సాయినాథుని** గూర్చి నాడు **"సాయిభక్త విజయం"**లో **శ్రీ బాబూజీ** వివరించిన ఒక అనుభవాన్ని గురుతుకు తెచ్చుకుందాం. ఒకసారి మహల్సాపతి జజూరీ యాత్రకు సిద్ధమయ్యాడు. ఆ యేడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్లేగు వ్యాధి భయంకరంగా విజృంభించి వుంది. ఆ దృష్ట్యా యాత్రికుల రాకపోకలపై ప్రభుత్వం వారు ఆంక్షలు విధించారు. నియమం తప్పకూడదని మహల్సాపతి ధైర్యం చేసి బయలుదేరాడు. బాబా అనుమతి తీసుకొని బయలుదేరగానే బాబా అతణ్ణి పిలిచి, రూ. 1.25 పై॥ ఇచ్చి, "యాత్రకు వెళ్లిరా! ఈ పైకం ఖర్చు పెట్టుకుంటే పెట్టుకో, లేకపోతే నీ ఇష్టం" అని అన్నారు. మహల్సాపతి బృందం అక్కడక్కడా విడిది చేస్తూ జజూరీ సమీపించేసరికి అక్కడ ప్లేగు చాలా తీవ్రంగా వుందని తెలిసింది. మహల్సాపతి బృందంలోని వారు ముందుకు పోవడానికి భయపడసాగారు. ఊరి బయట ఆగి ధైర్యం చేసి ముందుకు పోవాలా? లేక వెనక్కి తిరిగి పోదామా? అంతదూరం అంత కష్టపడి వచ్చి, వెనక్కి పోవడమెలా? అని మధనపడుతూ మహల్సాపతి పల్లకీ నానుకొని నిలుచుని ఆలోచిస్తున్నాడు. ఇంతలో అతనికి పల్లకీ ప్రక్కన బాబా నిల్చొని స్పష్టంగా కనిపించారు. బాబా అక్కడికెలా వచ్చారా అని ఆశ్చర్యపోతూ పలుకరిద్దామనుకునేసరికి చూస్తుండగానే బాబా అదృశ్యమయ్యారు. బాబా దర్శనంతో మహల్సాపతికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. తన దివ్యానుభవాన్ని తన తోటి యాత్రికులకు చెప్పి, "బాబా మనతోనే ఉన్నారు. మనం ఏమీ భయపడవలసిన పనిలేదు. పోదాం పదండి!" అని ముందుకు సాగాడు. ఆ యాత్ర క్షేమంగా, సంతృప్తి కరంగా పూర్తయింది. మహల్సాపతి శిరిడీ తిరిగి వచ్చి బాబాను దర్శించగానే బాబా అతనితో "అరె! భగత్, యాత్ర బాగా జరిగిందా? నేను కూడా యాత్రకొచ్చాను. నీవు జజూరీలో పల్లకీ నానుకొని నిలుచుని కన్పించావు!" అన్నారు. ఆ మాటలతో తాను





జజూరీలో బాబాను దర్శించడం తన మనో[భ్రాంతి కాదని, సర్వాంతర్యామియైన బాబా తాను సంకట స్థితిలో వున్నపుడు ప్రేమతో దర్శనమిచ్చి, తానున్నానని అభయమిచ్చారని – స్పష్టమైంది మహల్సాపతికి". ఇది మహల్సాపతి అనుభవం. భిన్నమైన సాయి సంప్రదాయాన్ని మన జీవితాల్లో అణువణువునా ప్రవర్తిల్లచేస్తున్న సద్గురు శ్రీ బాబూజీ ఈ గురుబంధువుకిచ్చిన అనుభవం ఇలాంటిదే! కాని ఒక 'రాజముద్రిక' కూడా ఉందండోయ్! చెప్పేస్తే బాగుండదు, ఆ రుచిని మీరే ఆస్వాదించండి **– గురుకృప**

సద్గురు చరణాలే రక్ష (మానస భజరే గురుచరణం) అని నమ్మిన నాకు గురుమహిమ యొక్క గొప్పతనం, అపారమైన ప్రేమతత్త్వం అర్థమైంది. మన జీవిత గమనంలో జరిగే ప్రతీ సంఘటన మనల్ని సద్గురువుకు ఇంకా..ఇంకా..చేరువ చేసేందుకు దోహదపడుతుందన్న శృతి వాక్యం నాకు అనుభవమైంది. 2005వ సం॥ మే నెలలో మా వారికి మామూలుగా జ్వరం వచ్చింది. మందులు వాడుతున్నా 15 రోజుల పాటు తగ్గలేదు. జ్వరం ఎక్కువ అవుతూ వారు ఆయాస పడటం నన్ను ఇబ్బంది పెట్టింది. అన్ని వైద్యపరీక్షలు చేయించి, ఎక్స్–రే తీయించాము. చూస్తే ఒక ఊపిరితిత్తు పూర్తిగా నీరు పట్టింది, మరొకటి సగం వరకు నీటితో ఉంది. ఊపిరితిత్తుల స్పెషలిస్ట్ దగ్గరకు తీసుకు వెళ్ళి చూపిస్తే, ఇంకా ఆలస్యం చేస్తే మనిషి బ్రతకడం కష్టమయ్యేదని, వెంటనే ఆ నీటిని తొలగించాలని చెప్పారు. నీరు తీసిన తర్వాత ఒక్కరోజు కూడా మరిచిపోకుండా మందులు వాడాలని, ఊపిరితిత్తులలో నీరు తీసే సమయంలో బరువు తగ్గినా, లేక నొప్పి వచ్చినా ప్రమాదం అనికూడా చెప్పారు. సద్గురు రక్షణలో ఉన్న మనకు ఏది ఎలా జరిగినా అది శ్రేయోదాయకమేనని నాకనిపించింది.

జ్వరం కారణంగా ఊపిరితిత్తులలో నీరు చేరిందని తెలిసిన మేము వెంటనే వైద్యం చేయించాం. అరలీటరు నీటిని ఊపిరితిత్తులలో నుంచి తీసారు. నొప్పి ఏమీలేదు. నెలరోజులు మందులు వాడాము. ఎటువంటి మార్పులేదు. ఆయన ఇంకా క్షీణించి ఆయన పనులుకూడా ఆయన చేసుకోలేక పోతున్నారు. స్నానం, భోజనం మేమే చేయించి కూర్చోబెట్టాలి, ఆహారం పెడితే మింగలేరు – ఇదీ ఆయన పరిస్థితి. డాక్టర్ మళ్ళీ నీరు తీద్దామని అన్నారు. బంధువులు, స్నేహితులు వచ్చి చూసి వెళ్తున్నారు. తెలిసిన వాళ్ళంతా నన్ను "నువ్వు ఎప్పుడూ, **గురువు, సత్సంగం, భజన**" అంటూ ఉంటావు, మరి నీకు ఈ కష్టం ఏమిటి? పిల్లలు చాలా చిన్న వాళ్ళు కదా! ఎలా నెట్టుకు వస్తావు అని అడిగారు. మావారు కూడా "**గురువు, గురువు** అంటావు...వారు ఏం చేసారని" అన్నారు. నాకు మాత్రం గురువుగారి మీదే విశ్వాసం. గురువుగారి చిత్రపటం ముందు నిలబడి "ఎంత కష్టం వచ్చినా నన్ను మీ పాదాల దగ్గరే ఉంచండి" అని చెప్పుకుని,







'బాబా' 'బాబా' అని చెప్పుకొనే నేను, బాబూజీ, బాబూజీ అంటూ గురుస్మరణ చేసుకుంటూ రాత్రి అంతా ఏడుస్తూ గురువుగారి ముందు కూర్చొన్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు, లేచేసరికి తెల్లవారు ఝామున 5గం॥లు అయ్యింది. నాకు బాధ స్థానే ఒక ధైర్యం వచ్చింది.

ఇక ఆ రోజంతా చాలా ధైర్యంగా ఉన్నాను. గురునామస్మరణ మహిమ నాకు ఎరుకలోనికి వచ్చింది. ఆరోజు సాయంత్రం 7గం॥లకు మా వారిని చూడటానికి మావారి సహోద్యోగి, వారి భార్య మా ఇంటికి పది సంవత్సరాలు తర్వాత వచ్చారు. నేను గురువు గారి వద్దకు వచ్చి 7సం॥రాలు అయ్యింది. ఆమె ఎప్పుడూ గురువుగారిని చూడలేదు. మా హాల్‌లో మగవాళ్ళు అందరూ కూర్చొన్నారు. బెడ్‌రూమ్‌లో నేను, బంధువులు, ఆమె, పిల్లలం మాట్లాడుకుంటున్నాం. మాట్లాడుతున్నంత సేపు ఆవిడ ఎదురు గదిలోకి చూస్తూ ఉంది. అర్థంగాక ఏమిటండి. నేను మాట్లాడుతున్నా మీరు ఆ గదిలోనికే చూస్తున్నారు అని అడిగాను. "మీ మావయ్యగారు ఆ గదిలో అటూ,ఇటూ తిరుగుతున్నారు కనీసం లైటు కూడా వేయలేదేమిటి" అని అడిగింది. ఆ గదిలో ఎవరూ లేరు కదా అని లైటు వేయలేదన్నాను. కాదండీ! తెల్లది, చేతులున్న బనియను వేసుకుని, తెల్లలుంగీ కట్టుకుని తిరుగుతున్నారు కదా! అన్నారు ఆమె. నేను పెద్దగా పట్టించుకోలేదు. సరే! వెళ్ళబోయే ముందు పూజగదిలోకి తీసుకు వెళితే గురువుగార్ని చూసి ఇప్పుడు నేను చూసింది ఈయననే అని చెప్పారు. గురుబంధువులయితే ఎప్పుడూ ఆ ధ్యాసలో ఉంటాం కనుక అలా అన్పించి ఉండొచ్చు అని అనుకోవచ్చు, కానీ ఎప్పుడూ చూడని వ్యక్తి ద్వారా నేను ఇక్కడే, నీ చెంతలో ఉన్నానన్న అభయాన్ని నాకిచ్చారు గురుదేవులు.

మరుసటి రోజు ఆసుపత్రిలో మావారు తనతో 'గురుకృప' పత్రిక నుంచుకుని ఆపరేషన్ థియేటర్ లోనికి వెళ్ళి అరలీటరు నీరు తీయించుకొని - స్ట్రెచర్ మీద వెళ్ళిన ఆయన నడుచుకుంటూ బయటకు వచ్చారు. ఆ రోజు నుంచి హుషారుగా ఉంటూ, ఊదీ వేసిన నీళ్ళతో మందులు వాడటం మొదలెట్టారు. జూలైలో గురుదేవులను తిరువణ్ణామలైలో దర్శించుకున్నాం. అక్కడి నుంచి వచ్చాక చేయించిన పరీక్షలలో ఒక ఊపిరితిత్తు సాధారణ స్థితికి, మరొకటి మందులతో నయమయ్యే పరిస్థితికి వచ్చిందని తెలిసింది. ఇప్పుడు మావారి ఆరోగ్యం కుదుట పడింది. మా ఇంట్లో ఉంటున్న గురుదేవుల-పాదపద్మములకు ఒకసారి నమస్కారం చేసుకోవాలని ఉంది. (7సం॥లు అయినా నాకు వారి పాదదర్శన భాగ్యం లభించలేదు) అయినా చింతలేదు, నా చెంతనే ఉన్నానని వారిచ్చిన అనుభూతి నన్ను ఆనందంగా ఉంచుతోంది.

**- ఝాన్సీ కుమారి, గాజువాక**







# గురుబంధువులే గురుతులుగా ... అనుభూతులే ముద్రలుగా...

నాపేరు శ్రీ. నాదొక చిన్ని ప్రపంచం. “శ్రీ సాయిబాబా, శ్రీ బాబూజీ, వైజాగ్‌లో అమ్మ, సత్యంగారు, నా భార్య, ఇంకొందరు సన్నిహిత గురుబంధువులు”. ఎలా ఉన్నా, ఏం చేస్తున్నా వీరి చుట్టూనే నా పనులు, నేను, నా ఆలోచనలు. బావిలో కప్పలాంటి వాడని పొరపడేరు, కాదండీ! పూజ్య గురుదేవులు శ్రీ బాబూజీ కురిపించిన అనుగ్రహ వర్షం సంతత ధారలా వర్షిస్తుండగా, అనుక్షణం నాచెంత ఉండి నా అడుగులను గమనిస్తూ, గమ్యం తానేనని తెలియ చెపుతున్న ఆ కరుణామూర్తిని ఎంతని కీర్తించను. అందుకే అన్నాడొక కవి “**భూపాల! నీ మ్రోల ఈ వేల గానాలు నీ రాజసానికవి నీరాజనాలు**”, సద్గురురాయా! నీ చెంతన మేము చేసే ఈ వేల కీర్తనలు కరుణలో రాజువైన నీ రాచరికానికి మా నీరాజనాలు అని.

తంతుల మత్తులో తల్లడిల్లిన నన్ను శ్రీ బాబూజీ తన చెంతకు చేర్చుకొని తల్లిలా సేదదీర్చారు. సద్గురువంటే, ద్వారం వద్ద నిలబడి అలసిసొలసి తన బిడ్డ ఎప్పుడు వస్తాడా! ఒడిలోకి తీసుకొని అవసరమైనవన్నీ ఇచ్చి అక్కున చేర్చుకుందామని ఎదురుచూసే **ద్వారక్–మాయి** అంటే అతిశయోక్తి కాదని అవగతమయింది. నేను చెప్పిన నా చిన్ని ప్రపంచంలోని పెద్ద వరం శ్రీ బాబూజీ ప్రసాదించిన ‘**సత్సంగం**’. సద్గురు సన్నిధానాన్ని అలవోకగా ప్రసాదించే సత్సంగం నన్ను కొంతవరకు మార్చటమే కాక, ఎన్నో మధురస్మతులను కూడా ఇవ్వడం అపారమైన సద్గురు అనుగ్రహానికి, అవ్యాజమైన వారి ప్రేమకు నిదర్శనం. ఇక నా చిన్ని ప్రపంచంలో పెద్ద అనుభవం మీతో!

నా భార్య పేరు ఉమారాణి. నాకు తొమ్మిదవ తరగతి నుండి క్లాస్‌మేట్. ఇద్దరం ప్రక్క ప్రక్క ఇళ్ళవాళ్ళం. ఇద్దరం కలిసి చదువుకుంటూ, ఆడుకుంటూ, పోట్లాడుకుంటూ ఉండేవాళ్ళం. డిగ్రీ రెండవ సంవత్సరంలో ఒక రోజు ఉన్నట్లుండి తెల్లవారుతుండగా నన్ను నిద్రలేపి, జీవితాంతం నీతో ఉండాలని ఉందని తన కోరిక చెప్పింది, సరే! ఏం చెయ్యాలో తోచలేదు. ఇద్దరం తను ఎమ్.ఎస్.సి., చెయ్యాలని, నేను ఎమ్.బి.ఎ. చెయ్యాలని ఆ తర్వాత పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాం. పూజ్య గురుదేవులు మా ఇద్దర్ని అదే క్రమంలో నడిపిస్తారని విశ్వసించాం. ఎన్నో అవరోధాలు ఎదురయినా తన చేత ఎమ్.ఎస్.సి., బి.ఇ.డి., నా చేత ఎమ్.బి.ఎ. చేయించి మా జీవనంలో స్వావలంబనను ఇచ్చి ఆదుకున్నారు శ్రీబాబూజీ.









నేను గురుదేవుల చెంతకు చేరక పూర్వం నాలోని ఆవేశాన్ని, కోపాన్ని, నేను చేసిన పొరపాట్లను దృష్టిలో ఉంచుకుని ఉమను నాకు ఇచ్చి వివాహం చేయటానికి నిరాకరించారు వాళ్ళ పెద్దవాళ్ళు. నేను ఉద్యోగం కోసం వైజాగ్ వచ్చేసాను. కాలం గడిచి పోతోంది.

చదువు అయిపోయాక ఒక సంవత్సరం పాటు ఒకళ్ళని ఒకళ్ళు చూసుకోను కూడా లేదు. బాబూజీకి చెప్పుకోవడం తప్ప ఏమీ చేయలేని వాడిని. నేను 2004 జూలై గురుపూర్ణిమకు శిరిడీ వెళ్ళినపుడు నా బాధను గురుదేవులకు చెప్పుకున్నాను, నాకు పరిష్కారం చూపమని. 2004వ సం॥ అక్టోబర్ 17వ తేదీ స్టీల్‌ప్లాంట్‌లోని శ్రీ సాయి సన్నిధానంలో సాయినామాన్ని ఆశ్రయించి మేమిద్దరం ఒకటయ్యాం. ఆ రోజు సాయంత్రం **చిన్నారుల సత్సంగం**లో 'ఉమ'ను గురుబంధువులందరికి పరిచయం చేశాను.

ఈ సందర్భంలో మీ అందరితో పంచుకోవాల్సిన మరొక అందమైన ప్రపంచం విశాఖ చిన్నారుల సత్సంగం. నిత్యం ఎదురయ్యే కల్మష చిత్తాలు, కాఠిన్యమైన మనసులను, మనుషులను చూసి అలసిపోయిన వారికి వారు చెప్పే బాబా లీలలు, చేసే Activities ఎంతో కొంత సేద తీరుస్తాయనటంలో అతిశయోక్తి లేదు. కులాల కుళ్ళు, మతాల ముళ్ళు, మూఢనమ్మకాల మత్తు, జాతకం వంటి జాడ్యాలు వారి దరి చేరకుండా శ్రీబాబూజీ ఆ చిన్నారులను తీర్చిదిద్దుతున్న వైనం, "**రాబోయే తరం – తప్పక – సద్గురుతరం**" అవుతుందన్న నమ్మకాన్ని కలిగిస్తుంది. చిన్నారుల రూపంలో బాబూజీ నన్ను మరింత చేరువ చేసుకున్నారనిపించింది.

వివాహమయిన 15రోజులలో ఉమ గాజువాకలో లెక్చరర్‌గా చేరింది. నేను మంచి కంపెనీకి మారదామని డిసెంబరు 15వ తేదీ ముంబాయి వెళ్ళాను. వివాహమయిన రెండునెలలకు అంటే ఖచ్చితంగా డిసెంబర్ 17, 2004 వ సం॥ ఉమకు యాక్సిడెంట్ జరిగింది. నేను ముంబాయిలో ఉన్నాను, ఉమతో ఎవ్వరూ (బంధువులు) లేరు. నిజానికి మాకు ఎవ్వరూ లేరు – గురువుగారు, గురువుగారిచ్చిన గురుబంధువులు తప్ప! ఉమ 4 నెలలు మంచం నుంచి కదిలే పరిస్థితి లేదు. తనకు 'అమ్మ'గా మారారు ఒక గురుబంధువు, తోబుట్టువయ్యారు ఇంకొకరు, సోదరులుగా సేవలెన్నో చేశారు మరో ఇద్దరు, ఇలా నా తోడుగా, నీడగా ఉంటూ వారందరి రూపంలో నీకు నేనున్నాను రా! అంటూ బాబూజీ ఎంతో ధైర్యాన్నిచ్చారు. నా కష్టాన్ని చూడలేక నన్ను తన భుజాలపై వేసుకుని అడుగులు వేయించిన గురుదేవులకు నా ప్రణతులనర్పిస్తున్నాను. నాకు **"గురుబంధువులే గురుదేవుల గురుతులయ్యారు, వారి ప్రేమానుభూతులే సద్గురు పద ముద్రలయ్యాయి".**







ఎంతోకాలం పడుతుందనుకున్న కాలి గాయం త్వరలోనే మానింది. ఉమ కాలేజీలో మళ్ళీ చేరింది. అనతి కాలంలోనే ఆ కాలేజీలో చాలా మంచిపేరు తెచ్చుకుంది. కానీ కాలిగాయాన్ని మరొక డాక్టర్‌కు చూపిస్తే ఇంకొకసారి ఆపరేషన్ చెయ్యాలన్నారు. ఇక విషయం గురుదేవులకు ప్రత్యక్షంగా విన్నవించి, వారి మాటతోనే ఏమైనా చేద్దామని అరుణాచలం చేరాం నేను, ఉమ. ఇప్పుడు ఆపరేషన్ ఏమీ వద్దు! అనీ, ఉమను M.Phil చేయమని చెప్పారు గురుదేవులు– సరే! అలాగే చేసింది ఉమ. గురుదేవులు మా గురించి రచించిన ప్రణాళిక మాకు ఆరోజు అవగతం కాలేదు. (నా చర్యలు అగాధాలు)

గురువుగారి వద్ద నుంచి వచ్చిన మూడునెలలు గడిచిన తర్వాత, ఉమ 'అమ్మ' కాబోతోందనే ఆలోచనతో టెస్టులు చేయించుకుంటే, లేదన్నారు డాక్టర్లు. డాక్టర్ అయితే నెల రావడం కోసంగా మందులుకూడా రాసేశారు. కానీ మా అమ్మ సందేహం వెలిబుచ్చడంతో తర్వాత రోజు మరలా పరీక్షలు చేయిస్తే ఉమ ప్రెగ్నెన్సీ గురించి కన్ఫర్మ్ అయ్యింది.

ఉమ ఆపరేషన్ చేయించుకుంటే Pain Killers వాడటం, వాటి ప్రభావం మాకు గురుదేవులు ఇవ్వదలచిన 'కానుక' మీద పడేది. తన ప్రెగ్నెన్సీ గురించి తెలియక ముందే, 2005 విజయదశమికి గురువుగారిని షిర్డిలో దర్శించుకున్న తర్వాత ఉమ Pain Killers వాడటం పూర్తిగా మానివేసి 'ఊదీ' మీద ఆధారపడింది. డాక్టరు – విజయదశమి అక్టోబర్2, 2006 సం॥ డెలివరీ కావచ్చని స్కాన్‌ను చూసి చెప్పారు. "గురుదేవుల జన్మదినం, బాబా మహాసమాధి చెందిన రోజు, నా పుట్టినరోజు" అయిన విజయదశమి రోజు అనగానే చాలా సంతోషించాం.

ఇంతలోనే 2006వ సం॥ సెప్టెంబర్ రానే వచ్చింది. సెప్టెంబర్ అంటే చిన్నారుల సత్సంగ వార్షికోత్సవ సంబరం. గత 3సం॥ నుంచి బాబూజీ అనుగ్రహాశీస్సులతో ఏ ఏటికాయేడు వినూత్నంగా చేసుకుంటున్నారు పిల్లలు. మొదటి సం॥బాబా లీలలు, గురుదేవులతో భక్తుల అనుభవాలు, రెండవ వత్సరం గురుదేవుల చిన్నతనం, కాలేజీ రోజులు, .....ఇలా సద్గురు చరితామృతాన్ని అందరికీ పంచి,దీపోత్సవం చేసుకున్నారు. మూడవ వత్సరం బాబా, బాబూజీల లీలలను నాటకంగా రంగస్థలంపై ప్రదర్శించి గురుపథంలో పయనిస్తున్నారు. మరి ఈ వార్షికోత్సవాన్ని ఎలా చేసుకుందాము! అని ఆలోచిస్తే శ్రీబాబూజీ సంకల్పంతో అది పల్లకీ ఉత్సవంగా రూపుదిద్దుకుంది. సాయిపథంలో మనమందరం సంబరంగా చేసుకొనే పల్లకీ లాంటిదే విశాఖలో చేయించుకున్నారు చిన్నారులు. గురుదేవుల అనుగ్రహంతో పల్లకీలో ఊరేగే పూర్ణ







చంద్రునిది ఏ రూపు అయితే బాగుంటుందని అంటే, పిల్లలు – అన్నయ్యా! గురుదేవుల ఈ మధ్య కాలంలోని రూపు అయితే మేము ఎంజాయ్ చేస్తామన్నారు. ఈ విషయాన్ని నరేంద్రన్నకు తెలిపాము. దయగల తండ్రి, బిడ్డల అభీష్టమే వారి మనోభీష్టముగా కలిగిన సద్గురు చంద్రుడు శ్రీ బాబూజీ విశాఖ వేంచేసారు. మా చిన్నారుల వినతిని ఆలకించి వారు పల్లకీ వేడుకను కన్నుల పండుగగా చేయించుకున్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని సత్సంగ కేంద్రము నుండి శ్రీ సాయి మందిరము వరకు పల్లకీ బోయలయినారు చిన్నారులు. గురుదేవుల రూపాన్ని చూసి ఎందరో గురుబంధువులు రెప్పవాల్చక, తర్వాతరోజు ఉదయం వరకు శ్రీ బాబూజీ ధ్యాసలో, ఊసులో గడిపారు. చిన్నారులు వారికి బాబా పట్ల, గురుదేవుల పట్ల ఉన్న ప్రేమను అలతి పదాల్లో అందరితో పంచుకున్నారు. ఇదంతా సద్గురువైభవము, వారి అనుగ్రహ విశేషవిశేష్యము. ప్రతీ సత్సంగంలో ఇలా జరుగుతుంది కదా! వీడు మనకిదంతా ఎందుకు చెప్తున్నాడు అని కదా మీ భావన సద్గురు దేవుడు తాను ఉత్సవం చేసుకోవడమే కాక నా జీవితంలో మరో గొప్ప 'ఉత్సవాన్ని' చేసారు.

మధ్యాహ్నం 3గం॥లకు వార్షికోత్సవం ప్రారంభమవుతుందనగా తెనాలి నుంచి ఫోన్ వచ్చింది – 'ఉమ'కు నొప్పులు ఆరంభమయ్యాయని, నేను విశాఖలో చిన్నారుల సత్సంగంలో ఉన్నాను. నాకు భయం వేసింది, బేబీ ఒక నెల ముందుగా పుడుతోందని, కానీ డాక్టర్‌తో మాట్లాడితే – పూర్తి నెలల బిడ్డ పుట్టబోతున్నారని చెప్పారు. తెనాలిలో బాబా మందిరం నుంచి శ్రీ బాబూజీ చిత్ర పటాన్ని హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళారు గురుబంధువులు. వైజాగ్ నుంచి అమ్మ డాక్టర్‌తో మాట్లాడితే ఇబ్బంది ఏమీ లేదని, సాయంత్రానికి డెలివరీ అవుతుందని చెప్పారు. డెలివరీ రూమ్‌లోకి మొదట తీసుకువెళ్ళిన శ్రీ బాబూజీని నర్సులు తిరిగి ఇచ్చేశారుట. కొద్ది సేపటికి డాక్టరుగారు వచ్చి సాదరంగా వారిని తీసుకెళ్ళి ఒక మ్యాట్ మీద కూర్చొబెట్టి, కలయా...నిజమా పాడుతూ 'ఉమ'కు ఆపరేషన్ చేసి, పుట్టిన బాబుకు మొదట శ్రీబాబూజీ రూపాన్ని చూపించి, తర్వాత వాడిని శుభ్రం చేసి బాబా ఊదీ పెట్టి అప్పుడు బయట ఉన్న గురుబంధువులకిచ్చారట.

శ్రీ బాబూజీ పల్లకీ ఉత్సవం మరో అర్థగంటలో ప్రారంభమవుతుందనగా మాకు బాబు పుట్టాడు, సత్సంగ వార్షికోత్సవంలో విశాఖ గురుబంధువులందరితో ఈ ఆనందాన్ని పంచుకొనే అవకాశమిచ్చారు శ్రీ బాబూజీ. సద్గురురూపులైన గురుబంధువులందరి ఆశీస్సులు వెంటనే వాడికి అందాయి. సద్గురు తరమైన మా జీవితాల్లో రాబోయే తరాన్ని ఆ సత్సంగంలోనే ఇవ్వటం సద్గురు కరుణకు, వారికి చిన్నారుల పట్ల ఉన్న ప్రేమను మరింత ద్యోతకం చేసింది. అక్టోబర్‌లో బిడ్డ పుడతాడన్న డాక్టర్ల మాట నిజమవుతుందనుకుంటే,









అక్టోబర్ మొదటి వారంలోనే ఉమ కు M.Phil పరీక్షలన్నారు. గురుదేవులు చేయమంటే చేస్తున్న డిగ్రీ కదా! అని ఆలోచించారు ఒక గురుబంధువు. సెప్టెంబర్ లోనే మాకు కానుకనిచ్చి ఉమ M.Phil Exams వ్రాయడానికి అడ్డంకులు లేకుండా చేసారు గురుదేవులు. జరిగే ప్రతీ విషయంలోనూ శ్రీ బాబూజీ 'ముద్ర' కనిపిస్తూనే ఉంది. పిల్లల సత్సంగం రోజే మా వివాహం, చిన్నారుల వార్షికోత్సవం నాడే మాకు వారు ప్రసాదించిన 'చిన్నారి', కలయా..... నిజమా పాడుతూ ఒక డాక్టర్ ఆపరేషన్ చేయడం, ఆ బిడ్డ తొలిచూపు శ్రీ బాబూజీనే అవ్వడం.... ఇంతకంటే ఏంకావాలి – సద్గురు దేవులైన శ్రీ బాబూజీని అనన్యదైవంగా, ధర్మంగా, తల్లిగా, తండ్రిగా రాబోయే తరాలన్నీ సద్గురు తరం కావాలన్న ఆకాంక్షతో గురుదేవుల చరణ కమలాల చెంత సుమాలైన... **ఉమ, శ్రీ., ముప్పలవానిపాలెం**

# ఎందరు భక్తులో అన్ని రూపాలు

"ఎక్కడెక్కడ ఎందరు భక్తులున్నా, అవసరమైనపుడు వివిధ రూపాలలో వారికి దర్శనమిచ్చి అనుగ్రహించారు బాబా. విశ్వమంతా తమ మనోరూపంగా గల ఆ సద్గురువుకు అదొక లెక్కలోనిది గాదు" ఇది ఆచార్యుల వారి అమృతవాక్కులు సాయి లీలామృతంలో! సాయి లీలామృతంలోని అధ్యాయం పేరు ఈ అనుభవానికి ఎలా సరిపోతుందో అనుభవం చదివి అవధరించండి. బల్వంత్ నాచ్నే, అన్నగారికి వచ్చిన ప్రమాదకరమైన రుగ్మతను తొలగించేందుకు శస్త్రచికిత్సకని 1909లో బొంబాయి ఆస్పత్రిలో చేర్చడం, దహానులో ఉన్న ఇంటికి ఒక సాధువు వచ్చి పట్టుపట్టి బెండకాయ కూర వేయించుకోవడం, ఆ సాధువు శస్త్రచికిత్స బాగా జరిగిందని చెప్పడం – ఆరోజు సాయంత్రమే ఒక సాధువు ఆస్పత్రికి వచ్చి ఆశీర్వదించి వెళ్ళారని కబురు రావడం – బాగుంది. అటు చరిత్ర – ఇటు వర్తమానం – మహారాష్ట్రలోని పల్‌సూద్ వేదికగా విగ్రహస్థాపన మిషగా ప్రమాదకర పరిస్థితులలో ఉన్న ఒక బిడ్డను అవగతం కాని రూపంలో ఆదుకున్న కరుణామూర్తి, అవ్యాజ ప్రేమమూర్తి శ్రీ బాబూజీ చరణములకు నమస్సులు. **– గురుకృప**

2001 జూలై 8న పల్‌సూద్‌లో నిర్మించిన మందిరంలో బాబా విగ్రహస్థాపన గురుదేవుల చేతులమీదుగా జరిగింది. ఈ మహోత్సవం పూర్తి చేసుకొని గురూజీ పల్‌సూద్ నుండి శిరిడీ తిరుగు ప్రయాణంలో ఒక ఇంటి ముందు కారు ఆపగా ఆ చుట్టుప్రక్కల ఉన్న పిల్లలు కారును చుట్టుముట్టారు. గురూజీ ఆ పిల్లలందరికీ చాక్లెట్స్ పంచిపెట్టారు. ఈ సమయంలో కారు ఆ ప్రదేశంలో సుమారు 10 ని॥ల పాటు ఆగింది. తరువాత బయలుదేరి శిరిడీ చేరింది గురువుగారి కారు. ఈ విగ్రహస్థాపన జరిగిన సుమారు 4,5 మాసాల తరువాత గురువుగారి కారు ఏ ఇంటిముందు ఆగి ఉన్నదో ఆ ఇంటిలోని 4 సం॥ వయస్సు గల పాపకు జరిగిన అనుభవం ఇది.







ఆ పాప పేరు ఊర్వశి. ఆ పాప అప్పటికి 2, 3 నెలల నుండి ..... వ్యాధితో బాధపడుతున్నది. వాళ్ళ పేరెంట్స్ ఆ పాపను ఆ చుట్టుప్రక్కల ఉన్న అందరి డాక్టర్స్‌కి చూపించారు. కానీ ఎవరూ తమ వల్ల కాదని చెప్పి, పాప ప్రాణానికి భరోసా కూడా ఇవ్వలేదు. అక్కడి ప్రాంతంలో వారి సాంప్రదాయంలో ఎవరికైనా ఏదైనా సమస్య వచ్చినా లేదా కోరిక ఉన్నా మ్రొక్కుబడిగా తాము నమ్ముకున్న దైవం ముందు అఖండ జ్యోతిని వెలిగించి ఆ జ్యోతి కొండెక్కేలోపు వారి సమస్యలు తీర్చమని, భారమంతా దైవం పైన వేస్తారు. వీరి కుటుంబ సభ్యులు స్వతహాగా బాబా భక్తులు కావటంతో బాబా పటం ముందు అఖండజ్యోతిని వెలిగించారు.

అఖండజ్యోతిని వెలిగించిన రెండవరోజు జరిగిన సంఘటన. సుమారు 14 సం॥ల వయస్సు గల ఒక బాలుడు చిన్న బుట్టతో క్యారెట్ (గాజరా) తీసుకొని ఆ ఇంటికి వచ్చాడు. పాప వాళ్ళ బామ్మని కేరెట్ తీసుకుంటావా అని అడిగాడు. బామ్మ ధర అడిగితే బుట్ట రూ. 50/– లు చెప్పాడు. వాస్తవంగా ఆ బుట్ట 5/– ఖరీదు చేస్తుంది కనుక రూ. 5/–కు ఇవ్వు అని బామ్మ అడగగా రూ. 5/– లకు ఆ కేరెట్ బుట్ట ఇచ్చేసాడు. తర్వాత అక్కడ పడుకొని ఉన్న ఆ పాపను చూసి ఏమైంది ఆ పాపకు అని ప్రశ్నించగా బామ్మ పాప పరిస్థితి వివరించింది. అప్పుడు ఆ బాలుడు ఇంట్లో పొయ్యిలో ఉన్న బూడిదను తెమ్మని అన్నాడు. ఆ బూడిదను తీసుకొని పాప నుదుటన పెట్టాడు. ఆ పాప వాళ్ళ చిన్నాన్న ఆ బాలుడిని నీవు ఎక్కడ ఉంటావు అని ప్రశ్నించగా ఆ బాలుడు గురువుగారు విగ్రహ స్థాపన చేసిన బాబా మందిరం వైపు చూపించి అక్కడ ఉంటాను అని సమాధానమిచ్చి వెళ్ళిపోయాడు. (పిల్లవాడు నిలుచున్న స్థానం – గురువుగారు కారు ఆపిన స్థానమే).

ఆ బాలుడు పాపకు బూడిదను నుదుటన పెట్టిన కొద్ది నిముషాలలో పాప లేచి మంచినీళ్ళు కావాలి అని అడిగి మంచినీళ్ళు త్రాగి తర్వాత నాకు ఆ కేరెట్ కావాలి అని మరల అడిగింది. అసలు డాక్టర్లు భరోసా ఇవ్వని పాప బూడిదను పెట్టించుకున్న 5 నిముషాలకే లేచి కూర్చోవడం, ఆ బాలుడు తెచ్చిన క్యారెట్ కావాలని అడగడం వాళ్ళకి ఆశ్చర్యం కలిగించి ఆ బాలుడు ఎవరా? అన్న ఉత్కంఠ కలిగింది. ఈ ఆలోచన వచ్చేసరికి ఆ బాలుడు ఇంటికి వచ్చి వెళ్ళే మధ్య సమయంలో 10 ని॥లు కూడా లేదు. వెంటనే వాళ్ళు ఆ బాలుడి కోసం ఆ ప్రాంతమంతా గాలించారు. కానీ ఆ బాలుడు వారికి మరలా ఎప్పుడూ ఎక్కడా కనిపించలేదు. గురువుగారే ఆ బాలుని రూపంలో వచ్చి పాపకు ప్రాణదానం చేసి పునర్జన్మ ప్రసాదించారు అని నిర్ధారించుకొని వారికి జరిగిన ఈ అనుభవాన్ని, ఆనందాన్ని సత్సంగంలో తోటి గురుబంధువులతో పంచుకోవడం జరిగింది.

**– వీరాస్వామి, పల్‌సూద్**







# రసస్పందన

తన బిడ్డల పురోగతే లక్ష్యంగా – తన బిడ్డలను కూడా తనలా పరిపూర్ణంగా రూపొందించ సంకల్పించిన సద్గురుదేవులు శ్రీ బాబూజీ చరణ కమలములకు ప్రణామాలు చేస్తోంది గురుకృప. సద్గురు భక్తుల చరితామృత పానాన్ని సవినయంగా అందిస్తూ, స్పందిస్తున్న ఈ శీర్షిక గురుపూర్ణిమసంచికలో గురుదేవులను స్తుతించుకుని సద్గురు భక్తులు నేర్పిన సంప్రదాయాన్ని పాటించింది.

మనిషిగా బ్రతకడం అందరూ చేసేదే, అయితే జీవించడమనేది కొందరికే సాధ్యం. పుట్టిన ప్రతి వ్యక్తి బ్రతకక తప్పదు కానీ బ్రతికే ప్రతీ వ్యక్తి జీవించలేడు. జీవించటానికి స్పందన కావాలి. జీవించే వానికి ఒక లక్ష్యమంటూ ఉంటుంది. బ్రతికే వానికి అంతా బరువుగానే ఉంటుంది. జీవించటానికి బ్రతికే వాడు చిరంజీవి. బ్రతకడానికి జీవించేవాడు మృతజీవి. గురుదేవులంటారు... "ఎందుకు పుట్టామో తెలియదు, ఎందుకు జీవిస్తున్నామో తెలియదు. నిష్కర్షగా,నిర్మొహమాటంగా చెప్పాలంటే, ఇంకా మరణించలేదు కనుక, మరణించే దాకా జీవించాలి గనుక–ఇంతకు మించి సమాధానం ఎవరైనా చెప్పగలరా"? అని. సాయిపథగామిగా జీవించేవారు పిడకలేరుకోవడానికి ప్రాధాన్యతనివ్వక, సద్గురువుకు చేరువ అవ్వడానికి తన అడుగుల గమనాన్ని విశ్లేషించుకుంటాడు. కేవలం తాను వాంఛించిన దానికి భిన్నంగా జరిగిన సందర్భంలోనో, ఒక ముఖ్యమైన నిర్ణయాన్ని తీసుకోవడంలోనో కాక తాను వేసే ప్రతీ అడుగు తనకు సర్వమూ అయిన ఆ సద్గురునాథునికి తనను ఎంత చేరువ చేస్తుంది అనేది గమనించుకుంటాడు. ఈ నా అడుగు సద్గురు సంప్రదాయానికి బద్ధమా! విరుద్ధమా! అని బేరీజు వేసుకుంటాడు. ఇలా తాను వేసే ప్రతీ అడుగులోనూ శ్రీసాయి పదముద్రలను గమనించుకుంటూ జీవనం సాగించిన అంకిత భక్తుడు రావు బహుద్దూర్ యస్.బి.ధూమల్. ధూమల్ నిజాయితీకి, సామర్థ్యానికి మెచ్చి ఆనాటి బ్రిటిష ప్రభుత్వం అతనికి ఇచ్చిన బిరుదు 'రావుబహుద్దూర్'. నాసిక్‌లో పేరు మోసిన న్యాయవాదిగా అందరికీ సుపరిచితుడైన ధూమల్ 1907వ సం॥లో తన 34 వ యేట శ్రీసాయి సందర్శనానికై శిరిడీ చేరాడు. తన మొదటి దర్శనం లోనే శ్రీ సాయి సాటిలేని మహాత్ముడన్న విషయం అతని హృదయంపై ముద్రించుకు పోయింది. తాను చేసిన మంచి పనులన్నీ శ్రీసాయి ప్రేరణే అన్న భావం ధూమల్‌కు కలిగింది. బాబా యొక్క అసాధారణ వ్యక్తిత్వము ధూమల్‌ను మరింతగా ఆకర్షించింది. దైవత్వము, మానవత్వము రెండును ద్యోతకమవుతున్న శ్రీసాయి జీవుల నుద్ధరించు తీరు గ్రహించి, బాబాను ఆదర్శమూర్తిగా నెంచి, వారి బోధలను పాటించి, వారు చూపిన బాటన పయనించి గమ్యము చేరుటకు మిష సాయి అసాధారణ








వ్యక్తిత్వమేనని మనం గమనించవచ్చు. సాయి దర్శనమయ్యాక ఇక ఏనాడు తాను ఏ విషయంలోనూ చింతించలేదు. సాయి ఆజ్ఞను అనుక్షణం పాటించుకుంటూ, కేవలం తాను ఇబ్బందుల్లో ఉన్నప్పుడే కాక, ప్రగతిపథంలోనూ శ్రీసాయి మాటనే తన బాటగా మలచుకున్నాడు. పూజ్యశ్రీ బి.వి.నరసింహస్వామీజీ ధూమల్‌ను కలిసి, అనుభవాలను చెప్పమని అడిగినపుడు, ధూమల్ చెప్పిన మాటలు గమనిద్దాం. "నాకు ఏఏ విషయాల్లో శ్రీ సాయితో అనుభావాలున్నాయన్న విషయాన్ని క్రోడీకరించడం కష్టం. నా ప్రతీచర్య, జీవితంలో జరిగే ప్రతీ సంఘటన శ్రీ సాయి సంకల్పం ప్రకారం వారి అనుమతితోనే జరిగింది". "అడుగడుగునా నిన్ను సంరక్షిస్తున్నాను. లేకుంటే, నీకేమయ్యేదో ఆ భగవంతుడికే ఎరుక." అంటూ బాబా పలికిన పలుకులే ధూమల్ భావానికి సాయి ప్రేమాశీస్సులు. తన అంకిత భక్తుని లౌకిక, ఆధ్యాత్మిక ఉన్నతియందు వారి సర్వజ్ఞత, సర్వనియంతృత్వ, సర్వ సమర్థతలను వానికి ఎరుకపరిచి కృతార్థుని చేయాలన్నదే సాయి సంకల్పం. జిజ్ఞాసువులగు గురుబంధువులు ఆనందింప కోరినపుడు మన అనుభవములను పంచుకొనుట మన విధి. మీ ఆనందాన్ని పంచుకోండి. పంచుకోవడం ద్వారా మీ ప్రేమను పెంచుకోవచ్చంటారు గురుదేవులు.

1909లో ధూమల్ భార్య గతించాక ధూమల్ మామగారు అతనికి మరో వివాహం చేయ సంకల్పిస్తారు. బాబా ఆజ్ఞకోసం వేడిన అతనికి బాబా నుంచి అనుమతి లభించదు. ధూమల్ మామగారయిన ఖింఖడే మరెప్పుడూ ధూమల్‌కు వివాహ సంకల్పం చేయలేదు. తన జీవితమంతా సాయి సంకల్పానుసారమే జరుగుతున్నా, బాబా పట్ల విశ్వాసం కలగడానికి ఎవరి స్వానుభవం వారికి ఎంతో దోహదపడగలదంటాడు ధూమల్. ఈ సందర్భంలో జరిగిన ఒక చక్కటి కూర్పును గమనిద్దాం. ఒకరోజు శిరిడీలో తాను బస చేసిన గదిలో నిద్రించాడు ధూమల్. ఉదయం సాయి చెంతకు వెళ్ళిన ధూమల్ తో బాబా 'తమ్ముడూ! నాకు రాత్రంతా నిద్రలేదు' అని అంటారు. ధూమల్ ఆశ్చర్యంగా 'ఎందుకని బాబా?' అని అడుగుతాడు. అప్పుడు బాబా రాత్రంతా నేను నీ గురించే ఆలోచించాను అని సమాధానం చెపుతారు. సిరిసంపదలు ఉండి కేవలం 34 సం॥లకు భార్యను కోల్పోయి, బిడ్డలు కూడా లేకుండా శారీరకంగానూ, మానసికంగానూ గాయపడిన ధూమల్‌ను మాయి అయిన సాయి కాక ఇంకెవరు కాచుకుంటారు.

వైద్య శాస్త్ర సరళికి, ప్రాపంచిక జ్ఞానమునకు వ్యతిరేకమైనను ధూమల్ సాయిమాటనే శృతివాక్యంగా పాటించేవాడు. నాసిక్‌లో తన పెద్దలు నివసించిన ఇంటిలోనే నివసించేవాడు ధూమల్. ఆ ఊళ్ళో ప్లేగు చెలరేగి అతని ఇంట్లో కూడా ఎలుకలు చచ్చిపడతాయి. సాయి తనకు ఏ ఆపదా రానివ్వరని తెలుసు









కనుక ఆ ఇంట్లోనే ఉండి బాబాకు ఉత్తరం రాస్తాడు. శ్యామా ఉత్తరాన్ని చదివి బాబాకు వినిపిస్తాడు. బాబా ఇల్లు మారమంటారు. వెంటనే ఇల్లు మారతాడు ఆ రోజు రాత్రే ఆ ఇంట్లోనూ ఎలుకలు చచ్చిపడడం గమనించి బాబాకు మరలా ఉత్తరం వ్రాస్తే బాబా ఆ ఇంట్లోనే ఉండమంటారు. ఆరోగ్య శాఖాధికారులు, ఇరుగుపొరుగు ఎంత చెప్పినా ఆ ఇంట్లోనే ఉంటాడు. తన ఇంట్లోనే మంచినీళ్ళు తాగే బావిలో ఎలుకలు చచ్చిపడడం చూసి బాబాకు మరల ఉత్తరం వ్రాస్తాడు. బాబా ఇల్లు మారమని చెపుతారని తలచి కొత్త ఇంట్లోకి వెళ్ళదలచి ఆ ఇంటి తాళం తీస్తుండగా సమాధానం వస్తుంది. వెంటనే మరలా సామానులన్నీ తీసుకుని పాత ఇంట్లోనే ఉండిపోతాడు ధూమల్. మృత్యువే ఎదురువస్తానన్నా ధూమల్ మాత్రం సాయిమాటకే కట్టుబడ్డాడు. ధూమల్ భార్యకు తన చెంతనే చేయవలసిన క్రతువులను చేయించి సద్గతినిచ్చారు బాబా.

ధూమల్‌కు బాబాపట్ల ఉన్న నిష్ఠకు సజీవసాక్ష్యం – ధూమల్‌కు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవిని స్వీకరించే అవకాశం లభిస్తుంది. కానీ బాబా మాత్రం ఈ కొత్తది మనకెందుకు! పాతది బాగుంది కదా! అని అనడంతో ఆ పదవిని నిరాకరిస్తాడు. ధూమల్ బాబా మాటనే ప్రమాణంగా తీసుకుని – ప్రగతి పథంలో పయనించాడు. అంతేకాదు, ఇంగ్లాండులో విద్యనభ్యసించే అవకాశం రావడం, బూటీ అన్నివిధాలా సహాయంచేస్తానన్నప్పటికిని "భావూ! ఇలాయత్, విలయత్, (సహజమైన అభిరుచి, దైవ సంకల్పం) రెండూ ఇక్కడే ఉన్నాయని" నిరాకరిస్తారు బాబా! ఆ సంకల్పాన్ని అక్కడితో వదిలిపెడతాడు ధూమల్. ఇదంతా చూసే వాళ్ళకు మూర్ఖంగా ఉన్నా, ఆరతి గీతంలో శ్రీ బి.వి.దేవ్ బాబాను వేడుకున్నట్లు ఈ ప్రపంచమంతా నన్ను మూర్ఖుడని నవ్వినా నీ చరణాలయందు నాకు మొక్కవోని భక్తిని ప్రసాదించమన్న చరణాలు స్మృతి పథంలో మెలగక మానవు. పై రెండు లీలల విషయంలో శ్రీ సాయి – ధూమల్ అనే భక్తుడి ద్వారా మనకు ఒక చక్కని బోధను అందించారు. ఈరోజున ప్రతి విషయాన్ని సద్గురువుకు విన్నవించే చేసుకుంటున్నామని భావిస్తున్న మనం ధూమల్‌లాగా ఆయాచితంగా మనకు అందే ఉన్నతిని కూడా సద్గురుదేవునికి విన్నవించే స్వీకరిస్తున్నామా? ఆలోచిద్దాం! సాయి సన్నిధానంలోని ఈ భక్తులను చూస్తే వీరు భక్తులా? లేక సాయి వెలిగించిన జ్ఞానదీపాలా? అని అనిపించక మానదు. ఊహాతీతుని లీలలు, జ్ఞానబోధలు, అనన్యభక్తికి తార్కాణాలు. 1911–14 ప్రాంతమున శిరిడీలోని గ్రామతగాదాల కారణంగా రఘు అనే బాబా భక్తుడిని ఒక మార్వాడీ కాంతను మానభంగము గావించాడన్న అభియోగంపై చెరసాలపాలు చేస్తారు. రఘు అమాయకత్వము నెరిగిన తాత్యా–ఖాపర్డే, దీక్షిత్, సాఠే వంటి ప్రసిద్ధ న్యాయవాదులను కలిసి కోర్టు ఉత్తర్వులను చూపుతాడు. కేసు బలంగా ఉండడంతో వారందరూ







నిస్సహాయతను వ్యక్తం చేస్తారు. బాబా "ఆ కాగితములను తీసుకొని భావ్ వద్దకు వెళ్లుము" అని ఆదేశిస్తారు. సాయి ఆజ్ఞ కావున అప్పీలు మెమో వ్రాసి, ఐరోపా దేశస్థుడైన జిల్లా మేజిస్ట్రేట్‌ను కలుస్తాడు. మేజిస్ట్రేట్ ఏమీ చదవకుండా కేవలం ధూమల్ నోటి మాటతో ముద్దాయిలందరూ నిర్దోషులని, విడుదల చేయమని ఆదేశిస్తాడు. కేసు గురించి మాట్లాడిన పిమ్మట మేజిస్ట్రేట్ బాబా గురించి ధూమల్‌ను అడుగుతాడు. అప్పుడు అర్ధమవుతుంది. ఇదంతా సాయి సంకల్పమేనని. దీనిని రూఢీ పరచడానికా! అన్నట్లు ముద్దాయిలు ధూమల్‌కు ఇచ్చిన మూడు వందల రూపాయల ఫీజును సాయి దక్షిణగా తీసేసుకుంటారు.

బాబా సమాధిరూపం ధరించాక ధూమల్ దివార్ స్టేట్‌కు రెవిన్యూ అధికారిగా, సుర్గణ ప్రాంతానికి కర్బరాగా ఉండడం జరుగుతుంది. తాను సుర్గణ అనే ప్రాంతంలో ఉండగా ఆ రాష్ట్ర ఉన్నతాధికారి అక్కడకు రావడం జరుగుతుంది. ఆ సమయంలో ధూమల్ భోజనం చేస్తుండటంతో అతనికి మర్యాద చేయలేకపోతాడు. అయితే ఆ అధికారి వేరే గదిలోకి వెళ్ళడం అక్కడ  బాబా చిత్రపటాన్ని చూడటం, పక్షంరోజుల్లో ధూమల్ అడగకుండానే అతని జీతాన్ని 50రూ॥లు పెంచడం జరుగుతుంది. బిడ్డ ప్రగతి తల్లి బాధ్యత కదా! సాయి అనుగ్రహ ముద్ర ధూమల్ జీవితంలోని ప్రతీ సందర్భంలోనూ మనం గమనించవచ్చు. ఒక్కొక్కసారి సాయి ధూమల్ నుంచి దక్షిణరూపంలో అతని దగ్గర ఉన్న ధనాన్నంతా తీసివేసుకోవడం జరిగేది. సాయి తీసుకొనే దక్షిణ ఎప్పుడూ ఒక ఆధ్యాత్మిక బోధను సూచించేది. సాయి దక్షిణ తీసుకోవడం గురించి ధూమల్ ఇలా అంటారు "భగవంతుడు తాననుగ్రహించదలచిన వారి నుండి సర్వమూ తీసివేసుకుంటారని" అన్నట్లే చేసేవారు. నాకు కూడా ఆయనెన్నో సార్లు అలా చేసారు. నా దగ్గర ఉన్న చివరిపైసా ఇచ్చివేస్తున్నా నాకు బాధ, భయము కలిగేవి కావు. కారణం, అన్నీ ఇచ్చేది అయనే; ఆయన ఇచ్చినదే ఆయన తీసుకుంటున్నారు. మన వద్ద ఉన్నదంతా తీసేసుకున్నా మరల ఆయనే మనకు సహాయం చేయాలి. ఆయనలా చేయక ఎవరినీ ఎన్నడూ విడవలేదు. సద్గురువే సర్వంగా, ఆయన వాక్కు వేదంగా సద్గురువు మాటే తన బాటగా సుఖదుఃఖాలలో సద్గురువే తోడుగా, నిష్ఠకు నిరూపణగా మెలిగిన ధన్యజీవి శ్రీ ధూమల్. సద్గురువుతో బంధమే ఉన్నతమైన సాధన అంటూ, సాయి అనుగ్రహామృతాన్ని చవిచూసి మనం ఏ పని చేయబోతున్నా ఈ పని మనలను మన గురువుకు చేరువ చేస్తుందా! లేదా! అని గమనించుకోమంటూ శ్రీ రావు బహుద్దూర్ ధూమల్ జీవితాన్ని నిరూపణగా అందించిన శ్రీ సాయికి జేజేలు పలుకుతూ, శ్రీ సాయి పదాల చెంత పుష్పంగా......

–గురుకృప

